క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

సీతానగరం: పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, ఎంపీటీసీ ఎ.సింహాచలం అన్నారు. లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో కార్యదర్శి మురళి పర్యవేక్షణలో కాలువల్లో పూడికలు తీయించారు. బ్లీచింగ్ చల్లించారు. లచ్చయ్యపేట, గుమ్మిడివరం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించనున్నట్టు వారు తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరచాలి



రావివలస పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న ఎంఈఓ

బలిజిపేట: విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరచాలని ఎంఈఓ 2 కె.శ్రీనివాసరావు తెలిపారు. పి.రావివలస ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల చేత పాఠ్య పుస్తకాలు చదివించి విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు పరచాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ వైస్‌చైర్మన్



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గున్నేశ్వరరావు

పార్వతీపురం టౌన్: పోటీ పరీక్షల ఉచిత శిక్షణను వినియోగించుకొవాలని ఉషా గున్నేష్ ఫౌండేషన్ ప్రతినిధి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఐ.గున్నేశ్వరరావు అన్నారు. వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉచిత శిక్షణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో మొదటిసారిగా పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్, ఆర్ఆర్‌బీ, గ్రూప్ -1, 2 పోటీ పరీక్షలకు బుధవారం నుంచి కోచింగ్‌ను వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జామి నారాయణస్వామి నోబుల్ వాకర్ సభ్యులు ఐ.వెంకటేష్, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షల పరిశీలన



ఇంటింట సర్వే

మక్కువ: జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ఆరోగ్య సర్వేను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు వెంకటభైరిపురం గ్రామంలో మంగళవారం తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ప్రతీ ఇంటి వద్ద చేపడుతున్న ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఏడు రకాల వైద్య పరీక్షలైన బీపీ, సుగర్, రక్తహీనత, యూరిన్ పరీక్షలు, మలేరియా, డెంగీ, కఫం నిర్ధారణ కొరకు అవసరమైన వైద్య పరికరాలను, కిట్లను వైద్య సిబ్బంది వద్ద పరిశీలించి, ఆయా ఆరోగ్య సమస్యలని బట్టి వాటిని ఏ విధంగా వినియోగిస్తున్నదీ సిబ్బందిని ఆరాతీశారు. సర్వే పక్కాగా నిర్వహించి ఆరోగ్య వివరాలు జేఏఎస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అందరికీ ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేయించి వాటి ఆవశ్యకతను వివరించాలన్నారు. ఈ సందర్భంగా సర్వేలో ఆయన పలువురు వద్దులతో మాట్లాడి ఆరోగ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ మరడ వెంకటరత్నం, పంచాయతీ సెక్రటరీ ఎమ్.శంకరరావు, స్థానిక పెద్దలు టి.రామకృష్ణ, సూపర్‌వైజర్స్ నిర్మల, జయగౌడ్, వైద్య సిబ్బంది భారతి, విజయ్‌కుమార్, ఆశా కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

కొండాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ రోగులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎస్‌ఎం కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఊరూ..వాడ.. జైజై గణేశా..



పార్వతీపురం టౌన్: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఆది దేవుడు గణనాథుడి ఉత్సవాలు ఊరూ... వాడ అంతటా సోమవారం సందడిగా ప్రారంభమయ్యాయి. సాలూరు, పార్వతీపురం పట్టణంలో జరిగిన కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. వినాయక చవితిని ప్రజలంతా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇక వినాయకచవితి త్రిరాత్రి, నవరాత్రి ఉత్సవాలు జరిపే చోట సందడి నెలకొంది. విద్యుత్ కాంతులతో గణేశ్ మండపాలు కాంతులీనుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురం టౌన్: వైకేఎం కాలనీలో కొలువుదీరిన వినాయకుడు



సాలూరు: బాగువలసలో వినాయకున్ని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



పార్వతీపురం టౌన్: వినాయకుని ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: కాశీపేటలో పూజలందుకుంటున్న గణనాథుడు



సాలూరు: మహంతి వీధిలో వినాయకుడు



సీతానగరం: గూడెం వీధిలో కొలువుతీరిన బొజ్జ గణపయ్య



మక్కువ: శంబరలో కొలువుదీరిన గణనాథుడు

22వ వార్డులో 'నా అడుగు మీ కొసమే..'



వార్డులో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

- సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పురపాలక సంఘం పరిధిలో ఉన్న 22వ వార్డులో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను కలుసుకుని వార్డులో మంచినీరు బాగా వస్తుందా, కాలువలు శుభ్రంగా ఉన్నాయా, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ అందరికీ సకాలంలో అందుతున్నాయా, ఇవి కాకుండా ఇంకా వార్డులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వార్డులో అపరిశుభ్రంగా ఉన్నచోట శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపి 2024 సాధారణ ఎన్నికల్లో ఆయనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డ్ కౌన్సిలర్ సభ్యులు కోరాడ శ్రీనివాసరావు (నాని), వివిధ వార్డుల కౌన్సిలర్లు ఎస్.లావణ్య, మజ్జి శశికర్, నిమ్మకాయల సుధీర్, వి.నేతాజీ, పి.జయంతి, రణభేరి బంగారునాయుడు, బి.ఆనంద్, జి.గాయత్రి, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రెడ్డి రవికుమార్, పాలవలస శ్రీనివాసరావు, సిరిపురపు ప్రకాష్, చిట్టి, ఎం.తవిటి నాయుడు, ఆకుల శ్రీనివాసరావు, జిల్లా ఎస్ఎస్ఎల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని బాగువలసకు మంగళవారం వచ్చిన ఆయన ప్రజలతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరుగుతూ లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేసారు. నేడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామని వివరించారు. జగనన్న పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.230 కోట్లు నియోజకవర్గంలో 1,27,823 మంది లబ్ధిదారులకు జమయ్యాయని అన్నారు. నియోజవర్గంలో నూతనంగా సుమారు 1550 ఫించన్లు మంజూరయ్యాయని అన్నారు. నియోజకవర్గంలో నెలకు 9కోట్ల 64 లక్షల రుపాయిలు ఫించను సొమ్ములు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

199వ రోజుకు చేరిన గడప గడపకు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో 84 సచివాలయాల పరిధిలో గ్రామాల్లో పూర్తి చేసామని మంగళవారం 199వ రోజుకు చేరిందని ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర పేర్కొన్నారు. నియోజకవర్గంలో మక్కువ మండలంలో ఇంకా 5 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. బాగువలసలో సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి తిరుపతి నాయుడును పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

రాజన్న రాకతో.. బాగువలస మురిసె..



మహిళలతో కోలాటం ఆడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిను ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. మండలంలో పెదపథం పంచాయతీ పరిధి బాగువలస, పాలికవలస గ్రామాల్లో స్థానిక సర్పంచ్ రెడ్డి సుకన్య, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అధ్యక్షతన ఎంపీడీఓ రమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తమ గ్రామాలకు వచ్చిన తమ ప్రియతమ నాయకుడైన ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు మేళతాళాలతో పూలవర్షం కురిపించి స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. బాగువలసలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. థింసా, కోలాటాల్లో రాజన్నదొర కాలు కదపడంతో స్థానికంగా జై జగన్, జై రాజన్నదొర నినాదాలతో గ్రామాలు హోరెత్తాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో 199వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో మండలంలో ఆఖరి సచివాలయం కావడంతో కేక్ కట్ చేసి రాజన్నదొర అందరికి పంచిపెట్టారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికి జగనన్న పాలనలో వివిధ పథకాలు ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో రాజన్నదొర వివరించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. దీన్ని ప్రజలంతా గుర్తించాలన్నారు. సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వీటిని ప్రజలే రానున్న రోజుల్లో ఓటు అనే ఆయుధంలో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైస్‌చైర్మన్ బంకురు శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనివాసరావు, కళ్లేపల్లి త్రినాధ, మువ్వల ఆదయ్య, సువ్వాడ రామకృష్ణ, సువ్వాడ భరత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోలాటం పోటీలు



ప్రథమ బహుమతి పొందిన రాముడువలస కళాకారులు

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల్లో మహిళల్లో ఉన్న విజ్ఞానాన్ని పెంపొందించడానికి, దాగి ఉన్న కళలను వెలికి తీయడానికి కళారూపాలు దోహద పడతాయని ఆర్ వెంకంపేట రైజింగ్ స్టార్స్ యూత్ ప్రతినిధులు పి.వినోద్, చంద్రశేఖరరావు, శంకరరావు అన్నారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సీతానగరం మండలం ఆర్.వెంకంపేటలో పెంటవీధికి చెందిన రైజింగ్ స్టార్స్ పవర్ ఆఫ్ యూత్ ఆధ్వర్యంలో కోలాటల పోటీలను నిర్వహించారు. కోలాటం పోటీలలో బొబ్బిలి మండలం రాముడువలస, నారాయణప్పవలస, నారశింహునిపేట(రెండు టీంలు) అలజింగి, బొడ్డవలస, సీతానగరం మండలం పణుకుపేట, మరిపివలస, గుమ్మిడివరం గ్రామాల నుండి కోలాట టీంలు పాల్గొన్నాయి. మంగళవారం ఉదయం నుండి రాత్రి 8 గంటల వరకూ ఉత్కంఠ భరితంగా నిర్వహించిన పోటీల్లో రాముడువలస జట్టు ప్రథమ బహుమతి, నారశింహునిపేట జట్టు ద్వితీయ బహుమతి, బొడ్డవలస జట్టు తృతీయ బహుమతి సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కోలాటం పోటీల్లో విజేతలకు రైజింగ్ స్టార్స్ పవర్ ఆఫ్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు.


గిరిజన గ్రామాల్లో శాస్త్రవేత్తల పర్యటన



వరి సాగు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సీతంపేట: మండలంలోని మల్లి, కుశిమి, పాత్రునిగూడ గిరిజన గ్రామాల్లో సీతంపేట వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన శాస్త్రవేత్తలు పి.సీతారాం, పి.సౌజన్యలు మంగళవారం పర్యటించారు. అక్కడి రైతులతో మాట్లాడి, వారు అనుసరిస్తు సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఆయా గ్రామాల్లోని వరి సాగును పరిశీలించిన వారు అధిక దిగుబడులకు పలు సూచనలు చేశారు. వరికి సోకే ఆకుమడత తెగుళ్ల నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్‌ను లీటరు నీటికి కలిపి లేదా సీమాస్తంను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో గాయత్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో 'ఆరోగ్య సురక్ష'



జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్, ప్రజాప్రతినిధులు

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో అందరూ భాగస్వాములు కావాలని తద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించడానికి కృషి చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. లక్ష్మీపురంలో సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ టి.పార్వతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలుపై సచివాలయ కన్వీనర్లు గ్రామవలంటీర్లు, గృహసారథులు, గ్రామ పెద్దలతో అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇళ్ల వద్దనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడానికి గ్రామాల్లోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్యారోగ్య శాఖల పర్యవేక్షణలో నిపుణులైన వైద్యులతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి పి.వెంకటినాయుడు, ఏఎన్ఎం రమాదేవి, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలకు లోబడి నిర్మాణ పనులు



బూర్జ సచివాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

సీతానగరం: మండలంలో జరుగుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలు నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు చేపట్టాలని పీఆర్ ఏఈఈ చంద్రమౌళి అన్నారు. బూర్జలో జరుగుతున్ను సచివాలయ భవనం, రైతు భరోసా భవన నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా సేవలందించేందుకు సచివాలయ వ్యవస్థను తెచ్చి అందుబాటులోకి సొంత భవనాలను తీసుకువస్తుందన్నారు. వీరికి అవసరమైన వసతులు కల్పించడానికి అనుకూలంగా భవనాలు నిర్మిస్తుందన్నారు. వీటి పనుల్లో నాణ్యతలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు. తాజాగా నాలుగు సచివాలయ భవనాలు పూర్తి కావడంతో పాటు విద్యుద్దీకరణ పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్నారు. బూర్జలో సచివాలయ భవనం, ఆర్‌బీకే భవనం పనులను నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జి.దాసు మాజీ సర్పంచ్ ఎం.చిన్నంనాయుడు, ఎంపీటీసీ జి.చిన్నంనాయుడు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలో పక్కాగా ఓటర్ల జాబితాలను తయారు చేసేందుకు సూపరువైజర్లు, బీఎల్వోలు కృషి చేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. మండల రెవెన్యూ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎన్వీ రమణ పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ సూపరువైజర్లుతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 పోలింగ్ కేంద్రాలలో 170 ఓట్లు వివిధ ఆరోపణలతో ఉన్నాయన్నారు. ఒకే కుటుంబంలో 10 కన్నా ఎక్కువ మంది సభ్యులున్న 15 కుటుంబాలు తేలాయన్నారు. 0 డోర్లున్న కుటుంబాలు 10 కుటుంబాలు తేలాయని అన్నారు. 4 పోలింగ్ కేంద్రాల్లో వందేళ్ల వయసు కల్గిన వారున్నారని గుర్తించామని తెలిపారు. వారి వివరాలను సేకరించి అవసరాన్ని బట్టి ఫారం నంబరు 6, 7, 8లలో నమోదు చేయడానికి సూపరువైజర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సూపరువైజర్లు బీఎల్వోల ద్వారా గ్రామాల్లో సమగ్రమైన సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కోరామని తెలిపారు. కార్యక్రమంలో సర్వే డీటీ పి.చిట్టిమ్మ, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల పయనం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన విద్యార్థులు మంగళవారం పయనమయ్యారు. ఈ నెల 21వ తేదీ నుంచి గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కేంద్రంగా జరిగే రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ గేమ్స్‌లో వారు పాల్గొంటారని తెలిపారు. భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్ నుంచి ముగ్గురు, ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ నుంచి ఇద్దరు, ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కాలేజ్ నుంచి ఒకరు, ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ స్కూల్ నుంచి ఒకరు చొప్పున విద్యార్థులు పోటీలకు వెళ్లారని పీడీ లక్ష్మి వెల్లడించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు పయనమైన భద్రగిరి గురుకుల పాఠశాల విద్యార్థులు